
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.0
కనిష్ఠం 22.0
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
మంగళవారం 23 జూలై 2024



ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	503.80 (121.3844)	నిల్	9,378
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	640.60 (3.35)	3,180	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	101.21 (0.87)	281	నిల్

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.142 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండోసారి శాసనసభ సమావేశాలు జరుగుతున్నాయి. గతంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు చేపట్టింది కానీ, శాఖల వారీగా నిధులు విడుదల చేయలేదు. ఈ సమావేశాల్లో శాఖల వారీగా నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది. ప్రభుత్వం ప్రాధాన్య క్రమంలో పలు శాఖలకు నిధులు కేటాయిస్తుంది. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యేలు నిధులు సాధించాల్సి ఉంది.యాదాద్రి జిల్లాలో భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలు పూర్తిస్థాయిలో ఉండగా, తుంగతుర్తి, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాలు పాక్షికంగా ఉన్నాయి. జిల్లాలోని ఒక్కో నియోజకవర్గంలో నాలుగు నుంచి ఎనిమిది మండలాలు ఉన్నాయి. వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపడతామని ప్రస్తుత ఎమ్మెల్యేలు ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చారు. వీటిలో ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, బ్రిడ్జిలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు పలు అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. ఈ సమావేశాల్లో వాటిని చర్చించి ఏ మేరకు నిధులు రాబడుతారోనని ఆయా నియోజకవర్గాల ప్రజలు వేచి చూస్తున్నారు.



శాసనసభ బడ్జెట్ సమావేశాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. దీంతో శాసనసభలో ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను చర్చించి అభివృద్ధి పనులకు ఏ మేరకు నిధులు సాధిస్తారోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.
- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

గళం విప్పేనా?


నేటి నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు
నిధులు మంజూరైతేనే అభివృద్ధి పనులు
ఎమ్మెల్యేలు ఏ మేరకు సాధించేనో?






నిధుల మంజూరుకు

ఎమ్మెల్యేలు నియోజకవర్గాల పరిధిలో పలు శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఇప్పటికే ముఖ్యమంత్రితో పాటు సంబంధిత మంత్రులకు విన్నవించారు. జిల్లాలోని పలు సాగునీటి ప్రాజెక్టుల పనులు పెండింగ్‌లో ఉన్నాయి.మూసీ కాల్వల పునరుద్ధరణ, బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్, దేవాదుల, డిండి ఎత్తిపోతల పథకం, తపాస్‌పల్లితో పాటు, పలు కాల్వల పునరుద్ధరణ పనులు చేపట్టాల్సి ఉంది. సాగునీటి పరంగా చేపట్టాల్సిన పనులకు రూ.వందల కోట్లలో చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. బస్వాపూర్ రిజర్వాయర్‌తో పాటు పలుచోట్ల ప్రధాన కాల్వల పనులు చేపట్టగా, డిస్ట్రిబ్యూటరీ కాల్వలు తవ్వాల్సి ఉంది. అదేవిధంగా నూతనంగా పలు పనులు ప్రారంభించాల్సి ఉంది. అందుకు ప్రధానంగా నిధులు అవసరం. మూసీ పరివాహక ప్రాంతాన్ని రూ.1,000కోట్లతో ప్రక్షాళన చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు మూసీ రివర్‌ఫ్రంట్ ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రణాళిక చేపట్టాల్సి ఉంది. నిధులు మంజూరైతే తప్ప, పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది.. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బ్రిడ్జిలు, నూతన రహదారుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. వీటి నిర్మాణంతో దూరాభారం తగ్గడంతో పాటు ప్రమాదాలు కూడా తగ్గుతాయి. భువనగిరి నియోజకవర్గంలో మూసీ వాగుపై రుద్రవెల్లి, సంగెం, వలిగొండలో బ్రిడ్జిలు నిర్మించాలని ఏళ్లుగా ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు గత ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించినా, అరకొరగా నిధులు మంజూరు చేయడంతో పనులు నిలిచిపోయాయి. భువనగిరి-చిట్యాల రోడ్డును నాలుగు లేన్లుగా చేస్తామని గతంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ రోడ్డును వెంటనే నాలుగు లేన్లుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని లింకు రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.150కోట్ల మేర అవసరమని ప్రాథమిక అంచనా. నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన పనులపై స్థానిక ఎమ్మెల్యేలు అసెంబ్లీలో గళం విప్పి నిధుల మంజూరుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం




నల్లగొండ: జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ త్వరితగతిన పూర్తిచేస్తాం. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతాం. కీలకమైన అన్ని ప్రాజెక్టులకు నిధులను గ్రీన్ ఛానల్ ద్వారా కేటాయిస్తాం. వచ్చే మార్చిలోగా బ్రాహ్మణవెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు పూర్తి చేయించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రారంభింపజేయిస్తాం. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని ఆరు లేన్లుగా విస్తరించేందుకు కృషి చేశాం. ఈ పనులకు వచ్చే ఆగస్టులో టెండర్ల ను ఆహ్వానించనున్నాం. నల్లగొండ బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేస్తాం. త్వరలోనే టెండర్లను ఆహ్వానిస్తాం. ఈ బైపాస్ నిర్మాణంపై వారంలో ఎస్ఎఫ్‌సీ ఏర్పాటు కానుంది. నల్లగొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా.
- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి

నెల్లికల్లు ఎత్తిపోతలకు నిధులు కోరతా



హాలియా: నెల్లికల్లు ఎత్తిపోతల పథకం పనుల వేగవంతానికి కావాల్సిన నిధుల విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తా. ఈ సీజన్‌లో రైతన్నలకు విద్యుత్ ఓవర్ లోడ్ సమస్య తలెత్తకుండా అవసరమైన నూతన ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరుకు నిధులు కోరతా. ఇప్పటికే ఉన్న రోడ్ల మరమ్మతులు, కొత్తగా మంజూరు చేయాల్సిన రోడ్లకు నిధుల కేటాయింపు విషయాన్ని ప్రస్తావిస్తా. వీటితో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులు త్వరితంగా పూర్తిచేసేందుకు ఆయ శాఖల మంత్రుల దృష్టికి తీసుకువెళ్తా.
- జైవీర్‌రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే

లిఫ్ట్ నిర్మాణానికి నిధుల మంజూరు చేయిస్తా



మిర్యాలగూడ: ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరుచేయాలని శాసనసభలో కోరుతా. సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న టేలెండ్ భూములకు నిరందించేందుకు దామరచర్ల అన్నవేరు వాగుపై రూ.75.93కోట్లతో, మూసీ నదిపై మంగల్‌తండా వద్ద రూ.229.90కోట్లతో అడవిదేవులపల్లి మండలం దున్నపోతుల గండి వద్ద రూ.219కోట్లతో, మాడ్గులపల్లి మండలంలో రూ.9.30కోట్లతో చేపట్టిన ఎత్తిపోతల పథకాల నిర్మాణ పనుల పూర్తికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసేలా అసెంబ్లీలో ప్రస్తావిస్తా.
- బత్తుల లక్ష్మారెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే

నక్కలగండి, డిండి ఎత్తిపోతల విషయాన్ని ప్రస్తావిస్తా



దేవరకొండ: శ్రీశైలం సొరంగమార్గం, నక్కలగండి, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులకు నిధులు కేటాయించి త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని కోరతా. దేవరకొండ నియోజకవర్గంలో కూరగాయల మార్కెట్, ప్రధాన రహదారులకు నిధులు మంజూరుపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు రోడ్లు, డ్రైనేజీ, రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరతా. దీంతోపాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించేందుకు అసెంబ్లీలో ప్రస్తావిస్తా.
- బాలునాయక్, దేవరకొండ ఎమ్మెల్యే

సాగు నీటి ప్రాజెక్టులు, మౌలిక వసతుల కల్పనకు కృషి



మోత్కూరు: నియోజవర్గ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తా. సాగు నీరందించేందుకు మూసీలో ఐదుచోట్ల చెక్‌డ్యాంలు నిర్మించాలని, బునాది గాని(ధర్మారం) కాల్వ, బృందావన్ కాల్వ, సదర్‌శాపురం నుంచి అడ్డగూడూరు పర్రె కాల్వల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరతా. ఎస్సారెస్పీ జలాలు చివరి గ్రామాల వరకు అందించాలని, రుద్రమ్మ చెరువు, ధర్మారం, గుమిడెల్లి, వెంపటి చెరువులను రిజర్వాయర్లు చేయాలని, ఆసిఫ్‌నహర్ కాల్వను శాలిగౌరారం మండలం కొండారం వరకు పొడిగించాలని కోరతా. వరంగల్ జిల్లాలో నిలిచిన దేవాదుల కాల్వను తిరుమలగిరి మండలం వరకు పొడిగించాలని కోరతా. మోత్కూరులో ఆర్టీసీ బస్‌డిపో ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అమ్మనబోలు, మోత్కూరు బ్రిడ్జిల నిర్మాణానికి, మోత్కూరు రెవెన్యూ డివిజన్, డిగ్రీ కళాశాల,30పడకల ఆస్పత్రి, మున్సిఫ్ కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తా. తుంగతుర్తిలో 100పడకల ఆస్పత్రి పను లు ప్రారంభించాలని కోరతా. 220 ఎక రాల ప్రభుత్వ భూమిలో పారిశ్రామికవాడ ఏర్పాటు, ఐటీఐ, తిరుమలగిరిలో స్టేడియం నిర్మాణానికి ప్రయత్నిస్తా. నియోజకవర్గంలో 300కి.మీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరతా.
- మందుల సామేలు, తుంగతుర్తి ఎమ్మెల్యే

బి.వెల్లెంల ప్రాజెక్టుకు నిధులు కేటాయించేలా కృషి



నార్కట్‌పల్లి: బ్రాహ్మణవెల్లెంల, ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టుకు ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించేలా అసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తా. బి.వెల్లెంల ప్రాజెక్టు పూర్తయితే నకిరేకల్ నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందు తుంది. నియోజకవర్గంలో పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. నకిరేకల్ మునిసిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు కావాలని కోరతా. కట్టంగూరు మండలంలోని అయిటిపాముల ఎత్తిపోతల ప్రాజెక్టు, పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాల్వ, బునాదిగాని కాల్వల నిర్మాణ పనులు పూర్తికి నిధులు మంజూరు చేయాలని కోరతా. జాతీయ రహదారిపై సర్వీసులు రోడ్లు లేక ఎదురవుతున్న ఇబ్బందులు, చిట్యాల నుంచి వయా భువనగిరి మీదుగా గజ్వేల్ వరకు ఉన్న రోడ్లను నాలుగు లేన్లుగా మార్చాలని ప్రస్తావిస్తా. నకిరేకల్-తిప్పర్తి, కట్టంగూరు-నల్లగొండ వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును విస్తరించాలని అడుగుతా. చేనేత సంఘాలకు ఎన్నికలు, గోపాలమిత్రల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా.
- వేముల వీరేశం, నకిరేకల్ ఎమ్మెల్యే

ట్రిపుల్‌ఆర్ పనులు వేగవంతం చేయాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ఢిల్లీలో జాతీయ రహదారులశాఖ కార్యదర్శి అనురాగ్ జైన్‌ను సన్మానిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

భువనగిరి అర్బన్, జూలై 22: ట్రిపుల్‌ఆర్, నల్లగొండ బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని రోడ్డు రవాణా, జాతీయ రహదారులశాఖ కార్యదర్శి అనురాగ్ జైన్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. సోమవారం ఢిల్లీలో ఆయన్ను కలిసి రోడ్ల నిర్మాణంపై చర్చించారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చే రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్) పనులు వేగవంతం చేయడంతో పాటు స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ ద్వారా త్వరగా టెండర్లు ఆహ్వానించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించి ప్రతిపాదనల పై త్వరగా నిర్ణయం తీసుకోవాలన్నారు. భూసేకరణ పూర్తయ్యేందున్న టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభమయ్యేందుకు కావాల్సిన అనుమతులు మంజూరు చేయాలన్నారు. నల్లగొండ పట్టణ పరిధిలోని జాతీయ రహదారి-565పై ఫ్లై ఓవర్ లేకపోవడంతో పాఠశాలల్లో చదివే విద్యార్థులు రోడ్డు దాటుతూ ప్రమాదాలబారిన పడుతున్నారని అన్నారు. పీఎంవో స్థాయిలో పరిస్థితి చక్కదిద్దాలని ఆదేశించిన నేపథ్యంలో రూ.9కోట్లతో ఫ్లైఓవర్ ఏర్పాటుకు అంచనాలు రూపొందించిందని వివరించారు. ఎస్ఎఫ్‌సీ సమావేశం నిర్వహించి టెండర్ ప్రక్రియ పూర్తి చేసేలా పనులు పూర్తి అయ్యేలా ఆయన కార్యదర్శి అనురాగ్ జైన్ దృష్టికి మంత్రి తీసుకువచ్చారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన జైన్, వారం రోజుల్లో ఎస్ఎఫ్‌సీ ప్రక్రియను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి వెంట ఆర్అండ్‌బీ స్పెషల్ సెక్రటరీ దాసరి హరిచందన ఉన్నారు.

జలకళ అంతంతే



- నిండని చెరువులు, కుంటలు
- జిల్లాలో అలుగులు పారినవి కేవలం తొమ్మిదే
- 75 నుంచి 100శాతం నీరు చేరినవి 19 మాత్రమే
- భారీగా వర్షాలు కురిస్తేనే చెరువులు నిండే అవకాశం

వానాకాలంలో భారీ వర్షాలతో సాగునీటి వనరులైన చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతుంటాయి. ఈ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదు. జిల్లా వ్యాప్తంగా జలకళ అంతంతమాత్రంగానే ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి వర్షపాతం గణనీయంగా తగ్గింది. గతంలో జూన్, జూలై నెలల్లో కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు పొంగిపొర్లాయి. ఈసారి ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలు నీరులేక బోసిపోతున్నాయి.
- (ఆంధ్రజ్యోతి, యాదాద్రి)

జిల్లాలో వారం రోజులుగా వర్షపాతం లోటు ఉండగా, నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సాధారణ స్థితికి చేరింది. వానాకాలంలో ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 202మి.మీ నమోదు కావాల్సి ఉండగా, 213.8మి.మీ నమోదైంది. అయితే ఈ వర్షపాతంతో చెరువులు, కుంటలు నిండే పరిస్థితి లేదు. భారీ వర్షాలు కురిస్తే తప్ప, ఈసారి జలాశయాల్లోకి నీరు వచ్చే అవకాశం లేదు. వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో 75 నుంచి 100శాతం నిండిన చెరువులు కేవలం 19వరకే ఉన్నాయి. జిల్లాలోని 17 మండలాల్లో మొత్తం 1,080 చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిలో 100ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉన్న చెరువులు 325 ఉండగా, వంద ఎకరాల లోపు ఉన్న చెరువులు 755వరకు ఉన్నాయి. 817 చెరువులకు ఇప్పటివరకు అలుగులు పారిన చెరువులు, కుంటలు చాలా తక్కువగా ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 0-25శాతం మేర నీరు చేరిన చెరువులు 212 వరకు ఉన్నాయి. 25-50శాతం నీరొచ్చిన చెరువులు 141, అదేవిధంగా 50-75శాతం వరకు నీరున్న చెరువులు 46, 75-100శాతం వరకు నీరొచ్చిన చెరువులు 19 వరకు ఉన్నాయి. అలుగులు పారినవి చెరువులు కేవలం తొమ్మిది మాత్రమే ఉన్నాయి.

భూగర్భజలాలపై ప్రభావం

చెరువులు, కుంటల్లోని నీరు చేరని పక్షంలో భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉంది. జిల్లాలో మెజార్టీ రైతులు వ్యవసాయ బోరుబావులపై ఆధారపడి పంటలను సాగుచేస్తున్నారు. అయితే చెరువులు, కుంటల్లో ఆశించిన స్థాయిలో నీరు చేరని పక్షంలో బోర్లు ఎండిపోనున్నాయి. ఈసారి కాలం ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెలలో భారీ వర్షాలు కురిస్తేనే పంటల సాగు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. తక్కువగా వర్షపాతం నమోదై, చెరువులు, కుంటల్లోకి సమృద్ధిగా నీరు చేరని పక్షంలో పంటల సాగు తగ్గే అవకాశం ఉంది.

13.2మి.మీ సగటు వర్షపాతం

జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులతో కూడిన వర్షం కురుస్తోంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన వర్షాలకు జిల్లాలో సగటున 13.2మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఆలేరు మండలంలో 26.6మి.మీ వర్షం కురిసింది.అత్యల్పంగా నారాయణపూర్ మండలంలో 2.5మి.మీవర్షపాతం నమోదైంది. రాజపేటలో 23.2మి.మీ, ఆత్మకూరులో 20.3మి.మీ, మోటకొండూరులో 18.1మి.మీ యాదగిరిగుట్టలో 17.0మి.మీ వర్షపాతం నమోదైంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరపి లేకుండా ముసురు కురిసింది. సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా తుంగతుర్తిలో 3.6సెం.మీ, అత్యల్పంగా మేళ్లచెర్వులో 6.4మి.మీ వర్షపాతం నమోదైంది. నల్లగొండ జిల్లాలో సగటున 10.7మి.మీ వర్షపాతం నమోదుకాగా, అత్యధికంగా శాలిగౌరారంలో 4.9సెం.మీ, అత్యల్పంగా వేములపల్లిలో 11.1మి.మీ వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌లో కురిసిన వర్షాలకు మూసీ భారీగా ప్రవహిస్తోంది. దీంతో మూసీ పరివాహక ప్రాంతాల్లోని రైతులకు కాస్త ఊరట చెందారు. మూసీ ఆయకట్టు వరి సాగు ఊపందుకోనుంది.

'నేత బజార్'పై ఏదీ నజర్?

- రెండు దశాబ్దాలుగా నిలిచిన పనులు
- పూర్తయితే ఐదు వేల మందికి ఉపాధి



చేనేత పరిశ్రమను ఆదుకునేందుకు 2003లో భూదాన్‌పోచంపల్లిలో నేతబజార్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. నేత వస్త్రాలు విక్రయించడం ఈ బజార్ ఉద్దేశం. నిధుల లేమితో ఇది పునాదులకే పరిమితమైంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు నేత బజార్ నుంచి పట్టించుకోకపోవడంతో ఆ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడు. దీంతో నేత బజార్ వివాదాస్పదమైంది. రెండు దశాబ్దాలు దాటినా నేతబజార్ పనులు ముందుకు సాగడం లేదు. ..7లో.
- భూదాన్‌పోచంపల్లి

మొక్కలు నాటే లక్ష్యాన్ని చేరాలి

కలెక్టర్ హనుమంతు కే. జెండగే



మోత్కూరు: సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే, చిత్రంలో ఎమ్మెల్యే సామేలు

భువనగిరి అర్బన్, జూలై 22: వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే లక్ష్యాన్ని చేరాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణాభివృద్ధిశాఖకు కేటాయించిన 11.28లక్షలకు ఇప్పటి వరకు 4.77లక్షల మొక్కలు నాటారన్నారు. వర్షాలు కురుస్తున్న సమయం వృథా కాకుండా వెంటనే మిగతా లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. నాటిన ప్రతీ మొక్క బతికేలా సంరక్షణ చర్యలు తీసుకోవడంతోపాటు జియోట్యాగింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో ఎంఏ.కృష్ణన్,అదనపు డీఆర్డీవో సురేష్ పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

అడ్డగూడూరు: కస్తూర్బా పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే మందుల సామేలు, కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. సోమవారం మండలంలోని కంచనపల్లి కస్తూర్బా పాఠశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేలు మాట్లాడుతూ, పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు.అనంతరం మానాయికుంట మూసీ వంతెన సమీపంలో చెక్‌డ్యాంమ్ నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఐదు చెక్‌డ్యాంమ్‌ల నిర్మాణ విషయాన్ని మంత్రి, సీఎం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

మోత్కూరును అభివృద్ధి చేయడమే లక్ష్యం

మోత్కూరు: మోత్కూరు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. సోమవారం కలెక్టర్ హనుమంతు కే.జెండగేతో కలిసి మోత్కూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, మునిసిపాలిటీ నూతనంగా కొనుగోలు చేసిన రెండు స్వచ్ఛ ఆటోలు, ఒక ట్రాక్టర్ ట్రాలీని ప్రారంభించి మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులకు భోజనశాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. మెయిన్ రోడ్డు నుంచి పాఠశాలలోకి సీసీరోడ్డు వేయిస్తానన్నారు. కార్యక్రమాల్లో మోత్కూరు మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, పేలపూడి వెంకటేశ్వర్లు, డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, ఇన్‌చార్జి డీఈవో ప్రశాంత్‌రెడ్డి, దబ్బెటి శైలజ, వంగాల సత్యనారాయణ, అవిశెట్టి అవిలిమల్లు, కొణతం నాగార్జునరెడ్డి, పోచం సోమయ్య, అన్నెపు వెంకట్, నీటిపారుదల శాఖ డీఈ సత్యనారాయణ, ఏశాలు చంద్రశేఖర్, అమర్, పోలెబోయిన లింగయ్య, కొప్పుల నిరంజన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్



'ప్రజావాణి'లో ఫిర్యాదులు తీసుకుంటున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

భువనగిరి అర్బన్, జూలై 22: 'ప్రజావాణి' ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించన 'ప్రజావాణి'లో ప్రజల నుంచి 59 ఫిర్యాదులు తీసుకొని మాట్లాడారు. ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా, ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. సమస్యలు, ప్రజా అవసరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి అన్నింటినీ పరిష్కరించాలన్నారు. 'ప్రజావాణి'లో రెవెన్యూ శాఖకు చెందిన ఫిర్యాదులు 49,పంచాయతీరాజ్‌శాఖ, సాంఘిక సంక్షేమశాఖకు చెందినవి రెండు చొప్పున, గ్రామీణాభివృద్ధి, పశుసంవర్ధక, విద్య, మున్సిపాలిటీ, రవాణా, భూగర్భ, ఖనిజశాఖలకు చెందినవి ఒక్కోటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయి.

ఈ కార్యక్రమంలో డీఆర్డీవో ఎంఏ.కృష్ణన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, కలెక్టరేట్ సూపరింటెండెంట్ పార్థసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ● వంద రోజుల్లో ఏబీసీడీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ కోర్ కమిటీ సభ్యుడు చిలుకూరి గణేష్ వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రం భువనగిరి-రాయిగిరి మధ్య భారతమాల పరియోజన కింద ప్రతిపాదించిన రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఉపసంహరించుకోవాలని గ్రామస్థులు కోరారు. ● తన పట్టా భూమికి పాస్‌పుస్తకం ఇవ్వాలని చౌటుప్పల్ మండలం లక్కారం గ్రామానికి చెందిన కుడపు యాదయ్య, నర్సింహ వినతిపత్రం అందజేశారు. ● తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ రెవెన్యూ పరిధిలోని 108, 109 సర్వే నంబర్లల్లో నక్ష బాటను సరిచేయాలని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ● భువనగిరిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శానిటేషన్,సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వెంటనే పూర్తిస్థాయి వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ.ఇమ్రాన్ 'ప్రజావాణి'లో కోరారు. ● ప్రభుత్వం ఆశాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కసగొని లలిత, ఆశా వర్కర్లు కోరారు. తొలుత కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి 'ప్రజావాణి'లో వినతిపత్రం అందజేశారు.

కలెక్టరేట్‌లో మహిళల ఆత్మహత్యాయత్నం

సూర్యాపేట(కలెక్టరేట్), జూలై 22: రెవెన్యూ అధికారులు తమ భూమిని తమ పేరిట పట్టా చేయడం లేదని ఆరోపిస్తూ ముగ్గురు మహిళలు సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన పోలీసులు వారి ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నడిగూడెం మండలం చెందిన రామాపురం గ్రామానికి చెందిన అరుణ, ఆమె కుటుంబ సభ్యులు లక్ష్మమ్మ, పుల్లమ్మలు సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి హాజరయ్యారు. తమ వెంట తెచ్చుకున్న బ్యాగులో ఉన్న పెట్రోల్ క్యాన్ తీసి తమకు న్యాయం చేయాలని ఒంటిపై పెట్రోల్ పోసుకోబోయారు. గమనించిన పోలీసులు వెంటనే వారి వద్ద నుంచి పెట్రోల్ క్యాన్‌ను లాక్కున్నారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ తమ గ్రామంలోని సర్వే నెంబరు 190లో తమ తాత అయిన మేడం ముత్తయ్యకు చెందిన 2.20 ఎకరాల వ్యవసాయ భూమి ఉందన్నారు. తాతముత్తాతల నుంచి ఆ భూమి తమకే ఉందని 2016 వరకు రికార్డుల్లో కూడా తమ తాత పేరు ఉందన్నారు. కానీ రెవెన్యూ అధికారులు తమ భూమిని తమ పక్క భూమి వారికి పట్టా చేశారని ఆరోపించారు. ఈ విషయంలో మండల రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ న్యాయం చేయడం లేదన్నారు. పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకోవాలని రెవెన్యూ అధికారులు చెబుతున్నారని తెలిపారు. తమ భూమిని తిరిగి తమ పేరున పట్టా చేయాలని లేనిఎడల తనతో పాటు తమ కుటుంబ సభ్యులు ఆత్మహత్యకు పాల్పడతామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ బాధిత మహిళలతో మాట్లాడి వారి సమస్యను పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.


మహిళలు పెట్రోల్ పోసుకోబోతుండగా అడ్డుకుంటున్న పోలీసులు, సిబ్బంది

'నకిరేకల్' చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

జిల్లా కలెక్టర్‌కు నోటీసు అందజేసిన కౌన్సిలర్లు


అవిశ్వాస తీర్మానం ప్రతిని కలెక్టర్‌కు అందజేస్తున్న కౌన్సిలర్లు

నకిరేకల్, జూలై 22: నల్లగొండ జిల్లా నకిరేకల్ మునిసిపల్ చైర్మన్ వైఖరితో అభివృద్ధి కుంటుపడిందని, ఆయనపై అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టాలని 11మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి నోటీసు అందజేశారు. సోమవారం రాత్రి కలెక్టర్‌ను కలిసిన వారు ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. 2019లో మునిసిపాలిటీగా ఏర్పడిన నకిరేకల్‌లో మొత్తం 20వార్డులు ఉండగా, నాడు 11బీఆర్ఎస్, 6 ఫార్వర్డ్ బ్లాక్, ఇద్దరు కాంగ్రెస్, ఒకరు ఇండిపెండెంట్ అభ్యర్థులు ప్రాతినిధ్యం వహించారు. చైర్మన్‌గా రాచకొండ శ్రీనివాస్(బీఆర్ఎస్), వైస్‌చైర్మన్‌గా మురారిశెట్టి ఉమారాణి(బీఆర్ఎస్) వ్యవహరించారు.

మారిన రాజకీయ పరిణామాల అనంతరం మునిసిపాలిటీలో ఆయా పార్టీల బలాబలాలు మారాయి. ప్రస్తుతం బీఆర్ఎస్‌కు నలుగురు, కాంగ్రెస్‌కు 16మంది వార్డుసభ్యులు ఉన్నారు. కొంతకాలంగా చైర్మన్ వార్డుల్లో జరిగే అభివృద్ధిని పట్టించుకోవ డం లేదని, తమకు సమాచారమివ్వడం లేదని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో వైస్‌చైర్మన్ మురారిశెట్టి ఉమారాణి(ప్రస్తుతం కాంగ్రెస్) నేతృత్వంలో చైర్మన్ శ్రీనివాస్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు సన్నద్ధమై జిల్లా కలెక్టర్‌ను కలిశారు. 16మంది సంతకా లు చేసిన అవిశ్వాస తీర్మానం ప్రతిని కలెక్టర్‌కు అందజేశారు. తమకు మెజార్టీ ఉన్నందున బీఆర్ఎస్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మునిసిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందని కాంగ్రెస్ సభ్యులు ధీమాగా ఉన్నారు.

చేతివేళ్లు అతుక్కున్న చిన్నారికి శస్త్రచికిత్స

వేరు చేసిన బీబీనగర్ ఎయిమ్స్ వైద్యులు


శస్త్రచికిత్స ముందు తర్వాత వేరు చేసిన చేతి వేళ్లు

బీబీనగర్, జూలై 22: పుట్టుకతోనే చేతి వేళ్లు అతుక్కున్న నాలుగేళ్ల చిన్నారికి యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ ఎయిమ్స్ వైద్యులు శస్త్రచికిత్స చేసి వేరు చేశారు. చేతి వేళ్లు అతుక్కుని ఉన్న నాలుగేళ్ల బాలుడిని తల్లిదండ్రులు రెండు రోజుల క్రితం ఆస్పత్రి ఓపీ విభాగానికి తీసుకువచ్చి అక్కడి వైద్యులకు చూపించారు. బాలుడి చేతి వేళ్లను పరిశీలించిన వైద్యులు శస్త్రచికిత్స చేసి వేరు చేయవచ్చునని నిర్ణయించారు. ప్రత్యేక కేసుగా పరిగణనలోకి తీసుకున్న వైద్యులు డైరెక్టర్ వికాస్ భాటియా, మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ అరోరా పర్యవేక్షణలో ప్లాస్టిక్ సర్జరీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మూలారోహిత్ రెండున్నర గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించి బాబుకు అతుక్కున్న రెండు వేళ్లను వేరు చేశారు. రక్తనాళాలు, చర్మంతో కలిపి క్రమ పద్ధతి సరి చేయడంతో పాటు అదనపు చర్మాన్ని అంటు కట్టి విజయవంతం చేశారు. పుట్టుకతో వచ్చే లోపంతో రెండు వేళ్లు అతుక్కున్నాయని, దీనిని వైద్య భాషలో ఫ్యూజుడ్ ఫింగర్స్ (సిండాక్టిలి) పిలుస్తారని పేర్కొన్నారు. వేళ్లు అతుక్కోవడంతో రోజువారీ కార్యకలాపాల నిర్వహణ కష్టతరంగా మారుతుందని, దీనిని ప్రారంభ దశలోనే శస్త్రచికిత్స చేస్తే చేతి సాధారణ పని తీరును పునరుద్ధరించవచ్చని తెలిపారు. అదనపు వేళ్లు, వంగిన వేళ్లు, చిన్న వేళ్లు, కాలిన గాయాల తర్వాత ఏర్పడే చేతి వైకల్యాలకు కూడా ఎయిమ్స్‌లో శస్త్రచికిత్స సదుపాయం అందుబాటులో ఉన్నట్లు డాక్టర్లు పేర్కొన్నారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి

చిట్యాలరూరల్, జూలై 22: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తిలో పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నకాపర్తికి చెందిన మెట్టు లింగస్వామి తన వ్యవసాయ పొలం వద్ద కొట్టంలో ఎద్దును కట్టేశాడు. ఆదివారం రాత్రి రైతు లింగస్వామి కొట్టం వద్ద తన ఎద్దుకు మేత వేసి వచ్చాడు. రెండు రోజులుగా ముసురు కురుస్తుంది. ఉరుములు, మెరుపులతో పాటు పిడుగు పడటంతో కొట్టంలోని ఎద్దు మృతి చెందింది. సోమవారం ఉదయం కొట్టం వద్దకు వెళ్లి చూడగా ఎద్దు కిందపడి ఉండటంతో దానిని పరిశీలించగా ఎద్దు మృతిచెందిఉంది. ఎద్దు మృతి చెందిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించగా తహసీల్దార్ కార్యాలయంలో సమాచారం అందించారు.

యాదగిరికొండపై హరిహరులకు పూజలు


శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, జూలై 22 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి కొండపై సోమవారం హరిహరులకు విశేషపూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, అనుబంధ ఆలయంగా కొనసాగుతున్న రామలింగేశ్వరుడికి శివాలయంలో స్ఫటికమూర్తులకు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో మూలమూర్తులను పంచామృతాలతో అభిషేకించి, తులసీదళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండిజోడు సేవలు, అర్చనలు కొనసాగాయి. శివపార్వతుల ఉత్సవమూర్తులను తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.13,59,707 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

విప్‌ను కలిసి ఆలయ ఉద్యోగులు

యాదగిరిగుట్ట ఆలయ ఉద్యోగుల బదిలీలు నిలుపుదల చేయాలని కోరుతూ రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను కోరారు. సోమవారం ఈ మేరకు ఆయన నివాసంలో కలిసి చర్చించగా, ఉద్యోగులకు తగు న్యాయం చేసే విధంగా సీఎంతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. విప్‌ను కలిసిన వారిలో ఏఈవోలు గజ్వేల్లి రమేష్‌బాబు, దూశెట్టి కృష్ణ, సూపరింటెండెంట్లు వాసం వెంకటేశ్, దొమ్మాట సురేందర్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, దాసోజు నరేష్, అధికారులు మంద స్వామి, నగేష్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

అసలే బుంగ.. ఆపై కాల్వ కట్టకు కోత

● సాగర్ ఎడమ కాల్వపై ఆందోళనకర పరిస్థితి



కోతకు గురైన చోటును పర్యవేక్షిస్తున్న అధికారులు, 20 రోజుల కిందట ఏర్పడ్డ బుంగ

నడిగూడెం / హుజూర్‌నగర్, జూలై 22: సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలోని రామాపురం వద్ద 120 కిలోమీటర్ రాయి వద్ద నాగార్జునసాగర్‌కాల్వ కట్ట సోమవారం కోతకు గురైంది. అదే ప్రాంతంలో 20 రోజుల కిందట కాల్వ కింద బుంగ పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతకు గురైన కట్టపైకి రాకపోకలను నిలిపివేశారు. కోతకు గురైన కట్టపై కంపవేశారు. ఈ కాల్వ కట్టకు కేవలం 2 కిలోమీటర్ల దూరంలోనే మూడు గ్రామాల ప్రజలు ఉంటారు. కట్ట తెగితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.

ఐదు రోజులుగా నీటి విడుదల

20 రోజుల కిందట 120వ కిలోమీటర్ వద్దనే ప్రస్తుతం కోతకు గురైన ప్రాంతంలోనే కాల్వ అడుగు భాగంలో బుంగపడింది. కాల్వ వెడల్పు 8 మీటర్లు ఉండగా సుమారు 3 మీటర్ల మేరకు బుంగపడినట్లు అధికారులు పేర్కొంటున్నారు. బుంగను పూడ్చలేదు. ఇంతలోనే ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌కు తాగు నీటి అవసరాల కోసం నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 3,600 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. కాల్వ అడుగు భాగంలో బుంగ పడడం, అదే ప్రాంతంలో కట్ట కోతకు గురికావడం, నీటివిడుదల యధావిధిగా కొనసాగుతున్న నేపథ్యంలో కట్ట సమీప ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కట్టపైనుంచి నడిగూడెం మండలంలోని రామాపురం, చాకిరాల, శ్రీరంగాపురం, కృష్ణానగర్, బరాఖత్‌గూడెం, నడిగూడెం ప్రాంతాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కాల్వ కట్ట తెగితే కృష్ణానగర్, రామాపురం, శ్రీరంగాపురం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఆయా గ్రామాలకు కాల్వ నీళ్లు వెళ్ళే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఎడమ కాల్వకు ఆయా గ్రామాలు రెండు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉండగా అనుకోకుండా ప్రమాదం సంభవిస్తే పరిస్థితి ఏంటన్న ప్రశ్న రైతులను వెంటాడుతోంది. నీటి ప్రవాహం పెరిగితే పూర్తిగా బలహీనపడి తెగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాల్వ కట్టపై రాకపోకలు నిలిపివేయడంతో ప్రజలు చుట్టూ తిరిగి వెళుతున్నారు.

పర్యవేక్షణ కరువు

సాగర్‌కాల్వపై అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడం కాల్వ కట్టలు బలహీనంగా ఉన్నా కానీ గుర్తించలేకపోయారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నీటి విడుదల సమయంలో అధికారులు పర్యవేక్షణ చేసి కాల్వ కట్టల స్థితిగతులను తెలుసుకోవాల్సి ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఇదిలా ఉండగా ప్రమాదాలు జరగాకుండా ముందస్తుగా ఎన్నెస్పీ డీఈ రఘు ఆధ్వర్యంలో తహసీల్దార్ హేమమాలిని, ఎస్ఐ అంజయ్‌కుమార్ ఇతర సిబ్బంది చర్యలు చేపట్టారు. కాల్వకట్ట మరమ్మతుల కోసం రూ.20లక్షలతో ప్రతిపాదన పంపినట్లు డీఈ రఘు తెలిపారు.

ఆధునికీకరణ పనులు ఆగమాగం

- పనుల్లో లోపించిన నాణ్యత
- సిమెంట్ డస్ట్‌తోనే పనులు
- సబ్ కాంట్రాక్టర్లు ఆడిందే ఆట.. పాడిందే పాట
- సబ్‌లీజుల్లో ప్రభుత్వ ఉద్యోగులు
- గడువు ముగిసి తొమ్మిది నెలలు
- ఆధునికీకరణ ఎప్పటికి పూర్తయ్యేనో?
- జాడలేని ఎన్నెస్పీ అధికారులు



హుజూర్‌నగర్ పరిధిలో జరుగుతున్న పనులు

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ పరిధిలో ఆధునికీకరణ పనులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గడువు ముగిసి తొమ్మిది నెలలు గడుస్తున్నా పనులు ఇంకా నత్తనడకన సాగుతూ..నే ఉన్నాయి. మొదటి జోన్ పరిధిలోని ముక్త్యాల బ్రాంచ్(ఎంబీ) కాల్వకు రూ.185 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆయా పనులను అడ్డగోలుగా చేపడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గుత్తేదారులు సబ్‌కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి చేతులు దులుపుకోగా, పర్యవేక్షించాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పనుల్లో నాణ్యత కొరవడింది.

\- హుజూర్‌నగర్

సాగర్ ఎడమకాల్వ పరిధిలోని ముక్త్యాల బ్రాంచ్ కాల్వ పరిధిలో 29 కిలోమీటర్ల మేర ఆధునికీకరణ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.185 కోట్లు మంజూరు చేసింది. 2002 మే 25న నుంచి గతేడాది నవంబరు 24వ తేదీ వరకు పనులు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. 18 నెలల్లో పనులు పూర్తి చేయాల్సిన పనులు నేటికీ పూర్తికాలేదు. కనీసం రూ.40 కోట్ల పనులు కూడా పూర్తిచేయలేదు. గడువు ముగిసి తొమ్మిది నెలలు దాటినా పనులు ఇంకా నత్తనడకనే సాగుతున్నాయి.

మునగాల నుంచి చింతిర్యాల వరకు

మునగాల హెడ్‌రెగ్యులేటర్ నుంచి చింతిర్యాల మేజర్ వరకు ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. కాగా ఒకటో కిలోమీటర్ నుంచి 8వ కిలోమీటర్ వరకు అదేవిధంగా 8 నుంచి 16వ కిలోమీటర్ వరకు, 16 నుంచి 22 వరకు, 24వ కిలోమీటర్ నుంచి 28వ కిలోమీటర్ వరకు ఇలా విభాగాలుగా పనులు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.వీటితో పాటు మట్టపల్లి, చింతిర్యాల, రెడ్లకుంట, రామాపురం, గణపవరం, బేతవోలు తదితర మేజర్ల పరిధిలో పనులు చేయాల్సి ఉంది.

ప్రజా సంఘాల నిరసన

ఇదిలాఉండగా కాల్వ పనుల్లో నాణ్యత లోపించిందని ప్రజా సంఘాల నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఓయూజేసీ నాయకులు, ప్రజా కళాకారులు, ఇటీవల ముక్త్యాల బ్రాంచ్‌కెనాల్‌ను పరిశీలించి ఇసుక, సిమెంట్ తక్కువ పాళ్లలో కలుపుతున్నారని, మొత్తం డస్టనే వాడుతున్నారని ఆరోపిస్తూ ఆర్డీవోకు ఫిర్యాదుచేశారు. అనంతరం మరోసారి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో మోకాళ్లపై కూర్చొని నోటికి రిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఎన్నెస్పీ ఉన్నతాధికారులు స్పందించిన దాఖలాలు లేవు. ఈ విషయంపై ప్రజాసంఘాల నాయకులు బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినట్లు సమాచారం.

సబ్ కాంట్రాక్టర్లలో ప్రభుత్వ ఉద్యోగులు

ఆధునికీకరణ పనులను ఒక ప్రధాన సంస్థ దక్కించుకుంది. కాగా ఆ పనులను సంస్థ చేపట్టకుండా సబ్‌కాంట్రాక్టర్లకు అప్పగించింది. ఉపాధ్యాయులు, వ్యవసాయాధికారులు, ఎన్ఎస్‌పీ డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన అధికారులు సిండికేట్‌గా మారి ఆయా పనులు చేపడుతున్నారు. ఎన్నెస్పీ అధికారులు కూడా సబ్ లీజులో ఉండడంతో పనులపై పర్యవేక్షణ కొరవడిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పనుల్లో ఎర్త్ వర్క్స్ సక్రమంగా చేయలేదన్న విమర్శలు ఉన్నాయి. కాంక్రీట్ నిర్మాణం, సీసీ లైనింగ్ పనులు, కాల్వ అడుగులో బెడ్ నిర్మాణం నాణ్యత లేకుండా చేస్తున్నారు. సీసీ లైనింగ్, బెడ్‌కు సంబంధించి సబ్‌కాంట్రాక్టర్లు ఇసుక, డస్ట్ 50 శాతం వాడాలనే నిబంధన ఉంది. కానీ సబ్ లీజుదారులు మొత్తం డస్ట్‌తోనే పనులు చేపడుతున్నట్లు తెలుస్తోంది. కాగా సిమెంట్, ఇసుక, కంకర మిక్సింగ్ చేసే ఒక అజాక్స్ యంత్రంలో ఉదాహరణకు 22 బస్తాల సిమెంట్ కలపాల్సి ఉండగా కనీసం 12 బస్తాలు కూడా కలపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. హుజూర్‌నగర్ పరిధిలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పనులను సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ వారం రోజుల కిందట పరిశీలించారు. కలెక్టర్ ముందు ఎన్నెస్పీ అధికారులు పనులు సజావుగా సాగుతున్నాయన్నారు. వాస్తవాలకు విరుద్ధంగా ఎన్ఎస్‌పీ అధికారులు కలెక్టర్‌కు తప్పుడు నివేదిక ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. క్వాలిటీ కంట్రోల్ అధికారులను గుప్పెట్లో పెట్టుకుని తప్పుడు రిపోర్టులు తయారుచేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తున్నట్లు తెలిసింది.

నాణ్యతగా చేపట్టాలని ఆదేశించాం

ఎంబీ కాల్వ ఆధునికీకరణ పనులకు సంబంధించి నాణ్యతా ప్రమాణాలతో పనులు చేయాలని ఆదేశించాం. మొత్తం రూ.185 కోట్లతో పనులు చేపడుతున్నాం. అధికారుల పర్యవేక్షణలో పనులు చేయాలని ఆదేశించాం. నాణ్యత లేకపోతే బిల్లులు చెల్లించం. క్వాలిటీ కంట్రోల్ అధికారులు పనులు పరిశీలించారు.

\- భిక్షం, ఎన్నెస్పీ డీఈ

పనులు నాణ్యతతో నిర్మించాలి



ఎంబీ కాల్వ పనులు నాణ్యతతో చేపట్టాలి. అధికారులు పట్టించుకోకపోవడంతో సబ్‌కాంట్రాక్టర్లు ఇసుక బదులు డస్ట్‌తోనే పనులు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు. గుత్తేదారులు అధికారులు ఒక్కటయ్యారు. అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేస్తున్నారు. రైతుల లక్ష్యం నెరవేరకుండా పోతుంది. పనులు మొత్తం పరిశీలించి కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి.

\- ముల్కలపల్లి సీతయ్య, రైతు, హుజూర్‌నగర్

ఉదయసముద్రానికి నీటివిడుదల



పెద్దఅడిశర్లపల్లి, జూలై 22 : నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలంలోని అక్కంపల్లి మెయిన్ కాల్వ నుంచి పానగల్ ఉదయసముద్రానికి తాగునీటి అవసరాల కోసం అధికారులు సోమవారం నీటిని విడుదలచేశారు. రోజుకు 1000 క్యూసెక్కుల చొప్పున 10 రోజులు నీటిని విడుదల చేయనున్నారు. అందులో భాగంగా అక్కంపల్లి ప్రధాన కాల్వ నుంచి 26.360 కిలోమీటర్ల దూరం ఉన్న ఉదయసముద్రానికి సోమవారం 500 క్యూసెక్కుల నీటిని ఎస్ఈ గంగమ్ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ జేవీ సత్యనారాయణ, డిప్యూటీ ఈఈ సీహెచ్ చక్రపాణి గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. అదేవిధంగా జంటనగరాలకు 525 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 45 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఈ నాగయ్య, ఏఈ శ్రావణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో ఎలక్ట్రికల్ మెకానిక్ ఆత్మహత్య

చింతపల్లి, జూలై 22 : నల్లగొండ జిల్లా చింతపల్లి మండలకేంద్రంలో అప్పుల బాధతో ఎలక్ట్రికల్ మెకానిక్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లి మండలకేంద్రానికి చెందిన పేర్ల వెంకట్‌రెడ్డి(51)కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అప్పులు చేసి కుమార్తెల వివాహం చేశాడు. మండల కేంద్రంలో చిరువ్యాపారం కోసం డబ్బా ఏర్పాటు చేసుకుని ఎలక్ట్రికల్ మెకానిక్ పనిచేస్తూ జీవితం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అప్పులు పెరిగాయి. అప్పులు ఇచ్చిన వాళ్ల ఒత్తిడి పెరిగింది. దీంతో ఆదివారం రాత్రి ఇంట్లోనే పడుకున్న వెంకట్‌రెడ్డి రాత్రి లేచి వెళ్లి దగ్గరలోని వ్యాపారం నిర్వహిస్తున్న డబ్బా కొట్టులో ఉరేసుకున్నాడు. సోమవారం ఉదయం మృతుడి భార్య దుకాణం డబ్బా వద్దకు వెళ్లి చూసే సరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమచారం అందజేయగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. వెంకట్‌రెడ్డి భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



అజయ్(ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి, జూలై 22 : నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు సోమవారం మృతి చెందాడు. ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దవూర మండలం పులిచర్ల గ్రామానికి చెందిన వాకిటి అజయ్(21), తిరుమలగిరి(సాగర్) మండలం అల్వాలకు చెందిన లింగపల్లి కొండలు(19)లు ఇద్దరు బావ, బావమరుదులు. ఆదివారం పులిచర్ల గ్రామంలో పీర్లపండుగ సందర్భంగా బావమరిది కొండలు పులిచర్లకు వచ్చాడు. పండుగ ముగిసిపోవడంతో ఇద్దరు పనిమీద బైక్‌పై కొండమల్లేపల్లికి వచ్చి తిరుగు ప్రయాణంలో పెద్దవూర మండలం పులిచర్ల వెళ్తుండగా కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై కొనమేకలవారిగూడెం వద్ద ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్నాయి. ప్రమాదంలో బైక్ నడుపుతున్న లింగపల్లి కొండలు అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న వాకిటి అజయ్‌కు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం వాకిటి అజయ్ మృతి చెందినట్లు ఎస్ఐ నర్సింహులు తెలిపారు. మృతుడు అవివాహితుడని, ఈ విషయమై లింగపల్లి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడ, జూలై 22 : సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలులో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం కోదాడ డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన గుండు గోపి, బొమ్మకంటి గోపి స్నేహితులు. గంజాయి తాగడానికి అలవాటు పడిన వారు ఆంధ్ర, ఒడిసా సరిహద్దులోని ఓ గ్రామంలో బాప అనే వ్యక్తి వద్ద నుంచి రూ.2 వేల చొప్పున రెండున్నర కిలోల గంజాయిని ఈనెల 1న కొనుగోలుచేశారు. ఈ గంజాయిని బొమ్మగంటి గోపి తీసుకురాగా, మిగిలినది గుండు గోపి ఇంట్లో ఉంచారు. దానిలో కొత్త గంజాయిని గోపి పీల్చి, మిగతా 1.080 కిలోల విక్రయిస్తానని స్నేహితులు గుండు రాజేష్, బత్తిని వెంకటేష్, కొలిమి శివ, పేరం శ్రీకాంత్‌లకు సోమవారం ఫోన్‌చేశారు. అందరు కలిసి గోపి ఇంట్లో ఉండగా, నమ్మదగిన సమాచారం మేరకు చిలుకూరు పోలీసులు దాడి చేసి ఐదుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 1.080 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయి విలువ రూ.20,600 ఉంటుందని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ తరలించామన్నారు. సమావేశంలో సీఐ రజితరెడ్డి, ఎస్ఐ రాంబాబు, సిబ్బంది వెంకటేశ్వర్లు, వీరస్వామి, నగేష్, వెంకటేశ్వర్లు, తిరుపతయ్య పాల్గొన్నారు.

అరకు నుంచి హుజూర్‌నగర్‌కు గంజాయి సరఫరా

హుజూర్‌నగర్, జూలై 22 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అరకులోయ నుంచి గంజాయి సరఫరా చేసి విక్రయిస్తున్న ఆరుగురిని సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పోలీసులు అరెస్ట్‌చేశారు. సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ చరమందరాజు నిందితుల వివరాలను వెల్లడించారు. హుజూర్‌నగర్‌కు చెందిన సయ్యద్ రహ్మాద్ బాబా, షేక్ జహీర్, మట్టపల్లికి చెందిన బాణోతు వెంకటేష్, వర్ధాపురానికి చెందిన చింతారెడ్డి సాయికుమార్, హుజూర్‌నగర్ మండలం లక్కవరం గ్రామానికి చెందిన జడ లింగస్వామి, హుజూర్‌నగర్‌కు చెందిన కాసా జయంత్‌లను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ నెల 9న హుజూర్‌నగర్‌కు చెందిన సయ్యద్ రహ్మాద్‌బాబా అలియాస్ సోహెల్, షేక్ బాలసైదా అలియాస్ తుఫాన్‌సైదాలు ఏపీలోని అరకు నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకొచ్చి హుజూర్‌నగర్‌కు చెందిన షేక్ యాసిర్, బత్తిని రమేష్‌లకు విక్రయిస్తుండగా పట్టుకోబోగా వీరమళ్ళ ఉపేందర్, షేక్ రజి, అఫ్రోజ్, మీసాల గోపి, చిల్లా వికాస్, షేక్ యాసిర్, బత్తిని ఉమేష్‌లను అరెస్ట్ చేశామన్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న సయ్యద్ రహ్మాద్‌బాబాను సోమవారం అతడి స్నేహితులైన షేక్ జహీర్, బాణోతు వెంకటేష్, చింతారెడ్డి సాయికుమార్, జడ లింగస్వామి, దగడ సాయి, కాసా జయంత్‌లకు లింగగిరి రోడ్డులోని గూబగుట్ట వద్ద గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం తెలుసుకుని దాడిచేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా ఈ దాడిలో రహ్మాద్‌బాబా నుంచి 360 గ్రాముల గంజాయి, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో గంజాయి కేసులో కేతావత్ నాగేందర్‌బాబు అనే బీహార్‌కు చెందిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ ముత్తయ్య, ఏఎస్ఐ జుట్టుకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భువనగిరిలో రెండు సెల్‌ఫోన్ దుకాణాల్లో చోరీ

● సుమారు రూ.25లక్షల విలువైన ఫోన్ల అపహరణ



తెల్లని ప్లాస్టిక్ కవర్ ధరించి చోరీ చేస్తున్న దొంగ, దుకాణం వెనుక వదిలేసిన సెల్‌ఫోన్ బాక్సులు

భువనగిరి టౌన్, జూలై 22 : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలో రెండు సెల్‌ఫోన్ దుకాణాల్లో భారీ దోపిడీ జరిగింది. పక్కపక్కనే ఉన్న రెండు దుకాణాల్లో కలిపి సుమారు రూ.25లక్షల విలువైన సెల్‌ఫోన్లు చోరీ అయినట్లు యజమానులు తెలిపారు. పట్టణ సీఐ సురేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ రోడ్డుపై బస్టాండ్ సమీపంలో టచ్ మొబైల్స్, ఎస్‌వీ మొబైల్స్ పక్కపక్కనే ఉన్నాయి. రోజువారి మాదిరిగానే ఆదివారం రాత్రి యజమానులు దుకాణాలను మూసివెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం వచ్చే సరికి చోరీ జరిగినట్లు చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు టచ్ మొబైల్స్ యజమాని నక్కల చిరంజీవియాదవ్, ఎస్‌వీ మొబైల్స్ యజమాని భట్టు సందీప్ పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు షట్టర్స్ తెరిచి పరిశీలించగా టచ్ మొబైల్స్‌లో రూ.22 లక్షల విలువైన సెల్‌ఫోన్లు, ఎస్‌వీ మొబైల్స్‌లోరూ.2లక్షల విలువైన ఫోన్లతో పాటు రెండు దుకాణాల్లో రూ.లక్ష నగదు చోరీ అయినట్లు తేలింది. అయితే దుండగులు ఒంటినిండా ప్లాస్టిక్ దుస్తులను, ముఖాలకు మాస్కులు ధరించి అర్ధరాత్రి 1.20 నిమిషాలకు లోనికి ప్రవేశించి చోరీ చేసినట్లు సీసీ పుటేజిల్లో రికార్డయ్యింది. అయితే దుకాణాల్లో చోరీ చేసిన మొబైల్స్‌ను దుకాణాల వెనకాలే ఉన్న ఖాళీ ప్రదేశానికి తీసుకెళ్లి కవర్స్‌ను అక్కడ పారవేసి ఫోన్లను మాత్రమే తీసుకెళ్లారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ కే సురేష్ కుమార్ తెలిపారు. పట్టణంలోని వరుసగా చోరీ సంఘటనలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

జల్సాల కోసం చోరీలు

కోదాడ, జూలై 22 : సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంతో పాటు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో 9 ఇళ్లలో చోరీ చేసిన అంతర్‌జిల్లా దొంగను పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ.8.35లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి కోదాడలోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం మామకన్ను గ్రామానికి చెందిన సయ్యద్ అల్తాఫ్ అలియాస్ అఫ్రోజ్ చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవటంతో బాబాయి వద్ద పెరిగాడు. స్నేహితుల ద్వారా విలాసాలకు అలవాటు పడ్డాడు. జల్సాలు చేయడానికి ఇళ్లలో దొంగతనాలు చేయడం ఆరంభించాడు.

ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పోలీసుస్టేషన్ పరిధిలోని ఆరు ఇళ్లల్లో, కోదాడ పట్టణంలో మూడు ఇళ్లలో చోరీలు చేశారు. ఆదివారం కోదాడలోని బంగారు దుకాణాలబజారులో పట్టణ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తూ అల్తాఫ్ పట్టుకుని రూ.8.35లక్షల విలువైన 99గ్రాముల బంగారు ఆభరణాలు, 500గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. అల్తాఫ్‌పై కేసు నమోదు చేశామని, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పట్టన సీఐ రాము, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగం పేరిట ట్రాన్స్‌కో ఉద్యోగి రూ.19.50లక్షల టోకరా

నకిలీ ఉద్యోగ నియామకపత్రంతో యువతిని మోసగించిన వైనం ● హైదరాబాద్ నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

భువనగిరి టౌన్, జూలై 22 : పరిచయాన్ని ఆసరాగా చేసుకొని ఓ యువతి నుంచి జిల్లా ట్రాన్స్‌కో ఉద్యోగి రూ.19.50లక్షలు టోకరా వేశాడు. ఈ ఘటన రెండు రోజుల కిందట వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే వలిగొండకు చెందిన ఓ ట్రాన్స్‌కో ఉద్యోగి మృతి చెందడంతో కారుణ్య కోటాలో అతడి కుమారుడు బందారపు కిరణ్‌కుమార్‌కు ట్రాన్స్‌కోలో ఉద్యోగం లభించింది. అయితే అతను ఉద్యోగంలో చేరినప్పటి నుంచే వివాదాస్పద వ్యక్తిగా గుర్తింపుపొందాడు. భువనగిరిలోని ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ హైదరాబాద్‌లో ఉండేవాడు. ఈ క్రమంలో ఉద్యోగ నియామకాల పరీక్షలకు సన్నద్ధమవుతూ కోచింగ్‌కు వెళ్తున్న హైదరాబాద్ నాగోల్ మమతానగర్‌కు చెందిన శ్రావణి 2021లో కిరణ్‌కుమార్‌కు పరిచయమైంది ఈ క్రమంలో ట్రాన్స్‌కోలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఆమె నుంచి రెండున్నరేళ్లలో దఫాల వారీగా రూ.19.50లక్షలు వసూలుచేశాడు. కొన్నిరోజులు తర్వాత టీజీఎస్ పీడీసీఎల్‌లో ఉద్యోగం వచ్చిందంటూ నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఆమెకు ఇచ్చాడు. ఈ మేరకు ఆమె లెటర్ ఆధారంగా హైదరాబాద్‌లోని ట్రాన్స్‌కో కార్యాలయంలో విధుల్లో చేరేందుకు వెళ్లగా ఆ లెటర్ నకిలీదని తేలింది. దీంతో తానిచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వాలంటూ కిరణ్‌కుమార్‌పై శ్రావణి ఒత్తిడి చేయగా ఆరు నెలల్లో ఇస్తానని ఒప్పుకున్నాడు. అయినప్పటికీ అతను డబ్బులివ్వకపోగా కొంతకాలంగా కనిపించకపోవడంతో మూడు రోజుల కిందట నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదుచేశారు. అయితే ఏడాది కాలంగా కిరణ్‌కుమార్ విధులకు రావడంలేదని, అతనిపై ఉన్న ఆరోపణలు, చెక్ బౌన్స్ తదితర కేసులపై విచారణ జరుపుతున్నప్పటి నుంచి విధులకు గైర్హాజరవుతున్నాడని ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయ అధికారులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

తిరుమలగిరి, జూలై 22 : సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. సోమవారం తిరుమలగిరిలో వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ ఆటోలోని వ్యక్తులు పోలీసులను చూసి పారిపోగా, వాహనాన్ని తనిఖీ చేశామన్నారు. 48 బస్తాల్లో 24 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి, వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మేళ్లచెర్వులో 40 క్వింటాళ్లు...

మేళ్లచెర్వు : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో అక్రమంగా నిల్వ చేసిన 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆర్డీవో శ్రీనివాసులు సీజ్ చేశారు. గజ్జెల కొండారెడ్డికి చెందిన పశువుల కొట్టంలో రేషన్ డీలర్ వీరబాబుకు చెందిన 80 బస్తాల్లోని 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని దాడులు చేసి స్వాధీనం చేసుకుని డీలర్ వీరబాబు, కొండారెడ్డిలపై కేసులు నమోదు చేశారు. దాడులలో ఆర్డీవోతో పాటుగా సివిల్ సప్లయ్ అధికారి రాజశేఖర్, తహసీల్దార్ జ్యోతి, ఆర్ఐ వాసు పాల్గొన్నారు

ఆలగడపలో ఏడు క్వింటాళ్లు..

మిర్యాలగూడ రూరల్, జూలై 22 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఆలగడపలో అక్రమంగా నిల్వ చేసి ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జిల్లా అన్నమ్మ రేషన్‌కార్డుదారుల నుంచి తక్కువధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ చేసిందన్న సమాచారం మేరకు దాడి చేసి సుమారు ఏడు క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. డయల్-100 ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు అన్నయ్యపై కేసు నమోదు చేశామన్నారు.

రైల్వే ట్రాక్ పక్కన గుర్తుతెలియని మృతదేహం

నార్కట్‌పల్లి, జూలై 22 : రైల్వేట్రాక్ పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రైల్వేపోలీసులు తెలిపారు. సికింద్రాబాద్- నడికుడి రైల్వేలేన్‌పై నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి శివారులోని కనకదుర్గ హోటల్ వెనకాల ఉన్న ట్రాక్ సమీపంలో సోమవారం మృతదేహం ఉన్నట్లు చిట్యాల స్టేషన్‌మాస్టర్ ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలికి వెళ్లి చూశామన్నారు. గుర్తుతెలియని రైలు ఢీకొని మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నామన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

'నేత బజార్'పై ఏదీ నజర్?

- రెండు దశాబ్దాలుగా నిలిచిన పనులు
- పూర్తయితే ఐదు వేల మందికి ఉపాధి

చేనేత పరిశ్రమను ఆదుకునేందుకు 2003లో యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో నేతబజార్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. నేత వస్త్రాలు విక్రయించడం ఈ బజార్ ఉద్దేశం. నిధుల లేమితో ఇది పునాదులకే పరిమితమైంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు నేత బజార్ పనులపై దృష్టిసారించకపోవడంతో ఆ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించారు. దీంతో నేత బజార్ వివాదమయమైంది. రెండు దశాబ్దాలు దాటినా పనులు ముందుకు సాగడం లేదు.

\- భూదాన్‌పోచంపల్లి



చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు, కార్మికులకు ఉపాధి కల్పించాలనే సదుద్దేశ్యంతో భూదాన్‌పోచంపల్లికి మంజూరైన నేత బజార్ నిధుల లేమితో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఓ భూస్వామి నేత బజారుకు కేటాయించిన స్థలాన్ని చదును చేసి కడీలు నాటి ఫెన్సింగ్ చేయడంతో చేనేత వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పూటగడవక ఇబ్బందులు పడుతున్న చేనేత కార్మికులకు ఉపాధి చూపాలనే ఉద్దేశంతో 2003లో టీడీపీ ప్రభుత్వం నేత బజారును మంజూరు చేసింది. చేనేత వస్త్రాలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించే స్తోమత లేక దిగాలుపడుతున్న చేనేత కార్మికులకు మార్కెటింగ్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రభుత్వ యత్నానికి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. దీని నిర్మాణం కోసం రూ.20 లక్షలు బీసీ కార్పొరేషన్, చేనేత జౌళీ శాఖ అధికారులు రూ.5 లక్షలు మంజూరు చేశారు. మొత్తం 10గదులు, పరిపాలనా భవనం నిర్మాణానికి అధికారులు పనులు ఆరంభించారు. పునాదుల నిర్మాణాన్ని పూర్తిచేసి పిల్లర్లను నిలబెట్టారు. అక్కడితోనే పనులు ఆగిపోయాయి.

రికార్డులు మాయం

నేత బజార్ ఏర్పాటుకోసం భూస్వామి ఇచ్చిన నాలుగు ఎకరాలకు సంబంధించిన ప్రభుత్వ స్వాధీనపత్రాలు తహసీల్దార్ కార్యాలయంలో మాయమయ్యాయి. దీనిపై పలుమార్లు చేనేత సంఘాల నాయకులు ప్రశ్నించినా సమాధానం లభించలేదు. అదేవిధంగా శిలాఫలకం ధ్వంసంకావడం అనుమానాలకు బలం చేకూర్చుతోంది. నేత బజార్‌ను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ చేనేత జనసమాఖ్య రాష్ట్ర కన్వీనర్ మాచర్ల మోహన్‌రావు హైకోర్టులో కోర్టులో కేసువేశారు. నిధుల లేమితో ఆగిపోయిన నేత బజార్ స్థలాన్ని డైయింగ్ వర్క్‌షెడ్లకు, పోచంపల్లికి కేటాయించదలచిన క్లస్టర్లకు కేటాయిస్తే కార్మికులకు చేయూత ఇచ్చినట్లవుతుంది. ఐదు వేల మంది కార్మికులకు నేత బజార్‌ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కలిగే అవకాశం ఉంది. నేత బజార్‌ను పరిరక్షించాలని, పనులు పునః ప్రారంభించాలని చేనేత కార్మిక సంఘం అధ్యక్షురాలు మెరుగు శశికళ, చేనేత నాయకులు భారత వాసుదేవ్, కర్నాటి అంజమ్మ, ఏలె భిక్షపతి, అంకం మురళి, జెల్ది నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చేనేత సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా



చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, గత పాలకుల వైఫల్యాలపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వారం రోజులుగా ప్రచురించిన కథనాలు వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రూ.కోట్ల వస్త్రనిల్వలు పేరుకుపోయాయి. టెస్కో ద్వారా వస్త్ర కొనుగోలు చేయకపోవడం, చేసినవాటికి డబ్బులు చెల్లించకపోవడం దురదృష్టకరం. చేనేత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు సీఎం ప్రత్యేకంగా 'నేతన్న భరోసా' ద్వారా చేనేత పరిరక్షణ కోసం కార్యాచరణ చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే టెస్కో సంస్థ ద్వారా చేనేత సంఘాలకు బకాయిలు రూ.32 కోట్లు విడుదల చేసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.5 కోట్ల మేరకు నిధులు మంజూరు చేసింది. చేనేత రంగాన్ని అన్నివిధాలా ఆదుకునేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కార్యక్రమాన్ని చేపడుతున్నారు. నేత కార్మికుల కష్టాలు, మార్కెటింగ్ సమస్యల అంశాలను పత్రిక కథనాల్లో గుర్తించాము. చేనేత సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నావంతుగా కృషి చేస్తా.

\- కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే

ఉపకార వేతనాలు విడుదల చేయాలి



నినాదాలు చేస్తున్న విద్యార్థులు

భువనగిరి టౌన్, జూలై 22: పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం భువనగిరిలో ర్యాలీ నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లెర్ల మోదీ రాందేవ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతుందన్నారు. ప్రభుత్వ రాజకీయ పథకాలకు వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తూ విద్యార్థుల చదువుల కోసం బకాయిలను విడుదల చేయడంలో ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. పేద విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు ప్రభుత్వ వైఖరి అడ్డంకిగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మహాలింగం, మణికంఠ గౌడ్, మధు నితీష్, ఓం ప్రకాశ్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి

తుర్కపల్లి, జూలై 22: ప్రభుత్వం మొదటి విడతలో రూ.లక్ష వరకు చేసిన రుణమాఫీలో ఇప్పటి వరకు 60శాతం మంది రైతులకే డబ్బులు జమ అయ్యాయని తుర్కపల్లి పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నర్సింహారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. తుర్కపల్లి పీఏసీఎస్ కార్యాలయంలో 1051మంది రైతులు వ్యవసాయ రుణాలు తీసుకోగా, వారిలో రూ.లక్ష వరకు 822మంది రైతులు, రూ.1.50లక్షల వరకు 218 మంది రైతులు, రూ.2లక్షల వరకు 11మంది రైతులు ఉన్నారని తెలిపారు. మొదటి విడతలో లక్ష వరకు అప్పు తీసుకున్న 822మంది రైతుల్లో 495మందికే అమలైందని, ఇంకా 327మంది రైతులకు డబ్బులు రావాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ కొండ్ర ముత్యాలు, డైరక్టర్లు చింతపండు చంద్రమౌళి, రాంచంద్రయ్య ఉన్నారు.

బొమ్మలరామారం: రైతులందరి రుణాలు ఏకకాలంలో మాఫీ చేయాలని బొమ్మలరామారం పీఏసీఎస్ చైర్మన్ గుడె బాల నర్సింహ అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పీఏసీఎస్‌లో మొత్తం 835ఉండగా 229 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని, మిగితా రైతులకు రుణమాఫీ జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు కొండోజు ఆంజనేయులు, గుండ్లపల్లి వెంకటేష్, జూపల్లి భరత్, ఇస్లావత్ భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'బీర్ల అయిలయ్యను విమర్శించే అర్హత లేదు'

మోటకొండూరు, జూలై 22: ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను విమర్శించే అర్హత మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతకు లేదని కాంగ్రెస్ జిల్లా జాయింట్ సెక్రటరీ భాస్కరుని రఘునాథరాజు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. సునీతను రెండుసార్లు ఆలేరు ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. అయిలయ్య చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శిస్తున్నారన్నారు. మహిళా గవర్నర్‌ను దుర్భాషలాడినప్పుడు విప్‌గా, సాటి మహిళగా ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు భూమండ్ల శ్రీనివాస్, భూమండ్ల అశోక్, మాజీ ఎంపీటీసీ బాల్ద రామకృష్ణ, బాల్ద సిద్ధులు, బుగ్గ మహేష్ పాల్గొన్నారు.

రాజాపేట: ఆలేరు అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యపై ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ మండల నాయకులు నెమ్లా మహేందర్‌గౌడ్, బుడిగే పెంటయ్య అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా పని చేసి, అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. సమావేశంలో ఇంజ నరేష్, బాల్‌రాజు, బొంత సుధాకర్ పాల్గొన్నారు.

బస్ డిపో, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

మోత్కూరు, జూలై 22: మోత్కూరులో ఆర్టీసీ బస్‌డిపో, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు కోరారు. సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ హనుమంతు కె. జెండగేకు సోమవారం వినతిపత్రం అందజేశారు. మోత్కూరు, గుండాల, ఆత్మకూరు(ఎం), అడ్డగూడూరు మండలాల చుట్టూ సుమారు 50కిలోమీటర్ల పరిధిలో డిగ్రీ కళాశాల లేక పేద, మధ్యతరగతి విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లలేక ఉన్నత విద్యకు దూరమవుతున్నారని బీఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆర్టీసీ డిపో లేక సుమారు ఏడెనమిది మండలాల ప్రజలకు ఆర్టీసీ బస్సుల సౌకర్యం లేక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో కొయ్యలకారి నరేందర్, లాదినేని సోమేశ్వర్, రాజు, యాకయ్య, సత్యనారాయణచారి పాల్గొన్నారు.

ఉపాధి హామీకి అధిక బడ్జెట్ కేటాయించాలి

మోత్కూరు, జూలై 22: కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి రూ.2.70 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి డిమాండ్ చేశారు. మోత్కూరులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. పదేళ్లలో మోదీ ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల సంక్షేమం, ఉపాధి కోసం కొత్త పథకాలు ప్రవేశపెట్టక పోగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని కూడా నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఏటా ఉపాధి హామీ నిధులకు కోత పెట్టి కూలీల పొట్టకొడుతోందన్నారు. గత ఏడాది ఉపాధి హామీ పథకానికి రూ.87వేల కోట్లు మాత్రమే కేటాయించడంతో ఉపాధి కూలీలకు సరైన పనులు దొరకలేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాచకొండ రాములమ్మ, గుండు లక్ష్మీ, కందుకూరి నర్సింహ, అలివేలు, యాదమ్మ తదితరులు ఉన్నారు.

ఎకరానికి రూ.80లక్షలు పరిహారం ఇవ్వాలి

యాదగిరిగుట్ట రూరల్, జూలై 22: ఆర్‌ఆర్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.80లక్షల నష్టపరిహారం ఇవ్వాలని భూ నిర్వాసితులు కోరారు. తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. గతంలో తమ భూములు వైటీడీఏ, కాళేశ్వరం ప్రాజెక్టుల కాల్వల నిర్మాణంలో తమ భూములు కోల్పోయి తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మళ్లీ ఆర్‌ఆర్‌ఆర్‌లో 104మంది రైతులకు సంబంధించిన 106ఎకరాల భూములు కోల్పోతున్నామని తెలిపారు. ఈ భూములకు ప్రభుత్వ మార్కెట్‌తో కలిపి మూడు రెట్లు చెల్లిస్తామని అధికారులు చెబుతున్నారని, దీంతో తాము మరోసారి తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో రైతులు కాల్నె భాస్కర్, భైరగాని పుల్లయ్యగౌడ్, బత్తిని రామకృష్ణగౌడ్, కాల్నె అయిలయ్య పాల్గొన్నారు.

గీతకార్మికుల ఎక్స్‌గ్రేషియా పెంచాలి

రాజాపేట, జూలై 22: ఎన్నికల ముందు కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కల్లు గీతకార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోళ్లగాని జయరాములు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. గీతకార్మికుల ప్రమాద ఎక్స్‌గ్రేషియాను రూ.10లక్షలకు పెంచాలన్నారు. ఉచితంగా సేఫ్టీ మోకులు అందించాలని ప్రతి గీత కార్మికునికి రూ.2లక్షల సబ్సిడీలను ఇవ్వాలని కోరారు. గౌడ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని గీతకార్మికులకు మోటార్‌సైకిళ్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాండవుల లక్ష్మణ్, గోపగాని బాలమణి, మహేందర్, బత్తిని సత్యనారాయణ, బుడిగే పెంటయ్య, ఉప్పలయ్య, సందెల భాస్కర్, పల్లె సంతోష్, చిలివేరు బాల్‌రాజు, భిక్షపతి, నగేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

మోత్కూరు, జూలై 22: ఎన్నికలకు ముందు కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం మోత్కూరు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పోచం సోమయ్య, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు దొంతి నర్సింహారెడ్డి, కొణతం నాగార్జునరెడ్డి, బి.నర్సింహ, స్వామి, చేకూరి మల్లేశం పాల్గొన్నారు.

తుర్కపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు చిలుకూరి రమేశ్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకల శ్రీనివాస్, జక్కుల వెంకటేశ్, నాయకులు కొక్కొండ లక్ష్మీనారాయణ, కందుకూరి చిన్న చలమయ్య, రేణికుంట భాస్కర్, కందుకూరి వేణు, కానుగంటి భాస్కర్‌యాదవ్, రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థాన్‌నారాయణపురం: బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సుర్వి వెంకటేశంగౌడ్, గంజి సునీల్, చిలువేరు జంగయ్య, చాడ అంజయ్య, నెర్లకంటి నాగరాజు, రఘు, గిరి పాల్గొన్నారు.

వలిగొండ: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు వెలిమినేటి వెంకటేష్ డిమాండ్‌చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బోళ్ల సుదర్శన్, సీనియర్ నాయకులు రాచకొండ కృష్ణ, బచ్చు శ్రీనివాస్, వెంకటేశం, జంగయ్య, నర్సింహ, రామ్‌చందర్ పాల్గొన్నారు.

రాజాపేట: ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బీసీ రిజర్వేషన్, 42శాతం పెంచాలని గొల్ల, కురుమలకు రెండో విడత గొర్రెలను అందించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు దాచెపల్లి రాజు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు నవీన్, నాయకులు నర్సింహులు, శేఖర్, సిద్దులు, కరుణాకర్, సురేష్ పాల్గొన్నారు.



తుర్కపల్లిలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



రామన్నపేటలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో ఎన్నికల సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గంగపురం శ్రావణ్, గుండ్ల రాజుయాదవ్, డబ్బికార్ సాయేష్‌కుమార్, గంజి బస్వలింగం, నోముల గణేష్, గొలనుకొండ ప్రభాకర్, చెరుకు వెంకటేష్, బండిరాల సుశీల, శ్రీకాంత్, చేరాల లింగయ్య, పల్లెకాడి బస్వయ్య, తండ రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): ఎన్నికల సమయంలో కామారెడ్డి సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా తెలంగాణలో బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, జి.కాశీనాథ్, బి.ఇంద్రారెడ్డి, పి.ప్రశాంత్, నర్సింహ్మా, మహేష్, మధు, వెంకటయ్య, సహదేవ్, సత్తయ్య పాల్గొన్నారు.

రామన్నపేట: ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పల్లపు దుర్గయ్య, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు రాపోలు నరేష్, జంగిలి సత్యనారాయణ, వనం అంజయ్య, బండ మధుకర్‌రెడ్డి, అక్కెనపల్లి సైదులు, కంభం పాటి శివరంజన్, బట్టే రమేష్, రావుల నరేష్, రాపోలు స్వామి, లక్ష్మీనారాయణ, రాపోలు రమేష్, శానకొండ మల్లిఖార్జున్‌చారి పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ కాలయాపన చేస్తోందని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేశ్, జిల్లా అధ్యక్షుడు దుర్గపతి లక్ష్మీనారాయణగౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉమాశంకర్, సతీష్, మట్ట ఆంజనేయులు, కిరణ్, జహంగీర్ ఉన్నారు.

చౌటుప్పల్ టౌన్: కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గందమళ్ల ఆనంద్‌గౌడ్ విమర్శించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, నాయకులు డి. బిక్షమాచారి, బత్తుల జంగయ్య, ఊడుగు వెంకటేశం, యాదయ్య, ఆలె చిరంజీవి, పి. జంగయ్య పాల్గొన్నారు.

మోటకొండూరు: ఎన్నికల ముందు ప్రకటించిన బీసీ డిక్లరేషన్ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు తండ కృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో కట్కామోజు మహేష్, ఆలేటి నాగరాజు, మల్గా అశోక్, నర్సింహులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

చౌటుప్పల్ టౌన్, జూలై 22: బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. వనమహోత్సవం సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే మొక్కలు నాటారు. పాఠశాలలోని డార్మెటరీలు, డైనింగ్‌హాల్, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో ముచ్చటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలోకి పాములు వస్తున్నాయని, డార్మెటరీలలో బల్బులు సరిగ్గా వెలగడం లేదని విద్యార్థినులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. మరుగుదొడ్లను సరిచేయాలని, డార్మెటరీ కిటికీలకు మెస్ ఊడి పోవడంతో దోమల బెడద ఉందని వాటిని సరిచేయాలన్నారు. 11ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాల రూపు రేఖలు మారుస్తామ న్నారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో మెస్‌చార్జీలు పెంచి విద్యా ర్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు చెందిన మొబైల్ వ్యాన్‌లో ఏర్పాటు చేసిన రాకెట్ తదితర పరికరాలను పరిశీలించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ప్రిన్సిపాల్ సరోజనమ్మ, కమిషనర్ ఎన్‌వీనాయక్, మాజీ ఎంపీపీ తాడూరు వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, ట్రాన్స్‌కో ఏఈ సతీష్, ఏవో నాగరాజు, మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు ఎండి. బాబాషరీఫ్, పి. శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నిరాకరించడంతో పాఠశాల అధ్యాపకవర్గంతో పాటు సంస్థ సిబ్బంది అవాక్కయ్యారు. శంకుస్థాపన చేయాలని ప్రిన్సిపాల్ సరోజనమ్మ ఎమ్మెల్యేను కోరారు. పాఠశాలకు చెందిన 11ఎకరాల స్థలంలో ఎలాంటి ప్లానింగ్ లేకుండా భవనాలు నిర్మించడం సరికాదని, ముందస్తు సమాచారం లేకుండా భవనానికి శంకుస్థాపన చేయమనడంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. దీంతో శంకుస్థాపన కార్యక్రమం నిలిచిపోయింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చిన్నాభిన్నం చేసిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచి గాడిలో పెట్టేందుకు ఆర్థిక మంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని మహిళా సంఘాలలోని విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్లు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన సందర్భంగా మాట్లాడారు.



విద్యార్థినితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

విద్యతోనే ఉన్నత స్థానం : కూరెళ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ట్రస్ట్ చైర్మన్ రవి

రామన్నపేట, జూలై 22: విద్యతోనే ఉన్నత స్థానం సాధ్యమని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య అన్నారు. హైదరాబాద్‌కు చెందిన రిలయబుల్ ట్రస్ట్ సమకూర్చిన రూ.3.50లక్షల విలువైన బ్యాగులను మండలంలోని వెల్లంకి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ తుపాకుల రవి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఉదయ రాణి, ఎస్‌ఐ మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు తంగెళ్ల సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్, సునీతను విమర్శించడం సరికాదు

మోటకొండూరు, జూలై 22: మంత్రి పదవి వస్తుందని ఆశతో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతపై నోటికి వచ్చినట్లు మాట్లాడడం సరికాదని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. బీర్ల ఫౌండేషన్ ముసుగులో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పుకొని ఓట్లు దండుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా గెలిస్తే మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చి, ఇప్పటి వరకు మండల అభివృద్ధి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండి బురాన్, బొట్ల శ్రీనివాస్, బొబ్బలి బుచ్చిరెడ్డి, బొట్ల పాండు, కొంపెల్లి నర్సింహులు, భూమండ్ల పరాశురాం, బొట్ల ప్రశాంత్, మొగులయ్య పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌పై ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య అన్నారు. గుట్టలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ యాదగిరిగుట్ట అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించి ఎంతో అభివృద్ధి చేశారని, అది మరిచి స్థాయిని మించి వారిపై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు పాపట్ల నరహరి, మిట్ట వెంకటయ్యగౌడ్, చిట్టర్ల బాలయ్య, ఎస్‌డీ బాబా, పి. సత్యనారాయణ, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

తెలంగాణ సాహిత్యంలో ధాశరథిది చెరగని ముద్ర

మోత్కూరు, జూలై 22: దాశరథి కృష్ణమాచార్యులు తెలంగాణ సాహిత్యంలో చెరగని ముద్ర వేశారని మోత్కూరు ప్రజాభారతి అధ్యక్షుడు దేవినేని అరవింద రాయుడు అన్నారు. దాశరథి జయంతి సందర్భంగా మోత్కూరులో సోమవారం ప్రజాభారతి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దాశరథి సాహిత్యం భావి తరాలకు మార్గదర్శకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రజాభారతి ప్రధాన కార్యదర్శి గుమిడెల్లి వెంకన్న, గాదె వెంకటేశ్వర్లు, బోళ్ల హనుమంతు, టి. ఉప్పలయ్య, మర్రి జయశ్రీ, కోమటి మత్స్యగిరి, బయ్యని రాజు, రాంప్రసాద్, ఎస్. మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ: కవి డాక్టర్ దాశరథి కృష్ణమాచార్యులు 99వ జయంతిని సోమవారం మండలకేంద్రంలో గాయత్రి ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాయధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి

ఆలేరు రూరల్, జూలై 22: మహిళలపై నిత్యం జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ సీత అన్నారు. ఆలేరులో సోమవారం జరిగిన ఆ సంఘం సమావేశంలో మాట్లాడారు. పురుషాధిక్య అధిపత్య సమాజంలో స్త్రీలు నిత్యం, అనేక అవమానాలకు అన్యాయాలకు గురవుతున్నారన్నారు. ఆధునిక సమాజంలో నేటికీ కూడా అసమానతలకు గురవుతున్నారన్నారు. ఈ సమావేశంలో పద్మ, మాధవి, ప్రమీల, ఉమా, సుజాత, లక్ష్మీ, బాలమణి, లత, తదితరులు ఉన్నారు.

వైద్య కళాశాల నియామకాల జాబితా ప్రదర్శన

భువనగిరి అర్బన్, జూలై 22: జిల్లాలోని ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో 32ఖాళీలకు నియామక ప్రక్రియకు సంబంధించిన జాబితా ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు టీం సభ్యుడు సెక్రటరీ బి. శాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొవిజినల్ మెరిట్ జాబితాకు సంబంధించి అభ్యంతరాలుంటే ఈ నెల 23, 24వ తేదీల్లో కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పన కార్యాలయంలో రాతపూర్వకంగా అభ్యంతరాలు తెలపాలని, గడువు దాటిన తర్వాత ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించబోరని తెలిపారు.

మునిసిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాస

భువనగిరి టౌన్, జూలై 22: నిరసనలు, వాగ్వాదాలు, హామీల నడుమ భువనగిరి మునిసిపల్ కౌన్సిల్ సమావేశం కొనసాగింది. 36 ఎజెండా అంశాలను చర్చించేందుకు చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో తైబజార్ వసూలు హక్కుల పొడగింపు అంశం తీవ్ర వివాదానికి దారి తీసింది. నిబంధనలకు విరుద్ధంగా తైబజార్ కాంట్రాక్ట్‌ను ఎలా పొడగిస్తారని పైగా కమిషనర్‌పై కోర్టుకు వెళ్లిన కాంట్రాక్టర్‌ను ఎందుకు ఉపేక్షిస్తున్నారంటూ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఏవీ కిరణ్‌కుమార్, చింతల కిష్టయ్య, ఎండీ. అజీమోద్దీన్, ఇట్టబోయిన సబిత ప్రశ్నించారు. వార్డుల వారీగా అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపులో పాలకపక్షం పక్షపాతం చూపిందంటూ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు పోడియం ముందు కూర్చొని నిరసన తెలిపారు. ఈ క్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు ఈరపాక నర్సింహ, తంగెళ్లపల్లి శ్రీనివాణి, పచ్చర్ల హేమలత, పడిగెల రేణుక తదితరులు జోక్యం చేసుకుంటూ నాలుగేళ్లుగా పాలక పక్షంగా ఉన్న బీఆర్‌ఎస్ పట్టణా భివృద్ధికి చేసిందేమీ లేదని, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పట్టణాభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. దీంతో మరోమారు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఎదురుదాడి చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి పట్టణాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా తేలేదని అన్నారు. దీంతో ఇరువర్గాల మధ్య సాగిన వాదనలతో సమావేశంలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. బీజేపీ కౌన్సిలర్లు రత్నపురం బలరాం, నల్లమాస సుమ మాట్లాడుతూ తైబజారు వసూళలో కాంట్రాక్టర్ నష్టపోయినందున మానవత్వంతో వసూళ్ల గడువును ఏడాదికి పెంచాలని ప్రతిపాదించారు. కాంట్రాక్టర్ కమిషనర్‌పై వేసిన కోర్టు ధిక్కరణ కేసును ఉపసంహరించుకోవాలనే షరతు, కోర్టుకు తెలిపిన 60శాతం నష్టం గణాంకాల ఆధారంగా అక్టోబరు 31వ తేదీ వరకు మూడు నెలల పాటు కాంట్రాక్ట్ గడువును పొగడిస్తూ కౌన్సిల్ తీర్మానించింది. ఆర్‌బీనగర్ కమాన్‌రోడ్డు విస్తరణకు అవసరమైన ప్రైవేట్ స్థలాన్ని సేకరించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. చైర్మన్ వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ పార్టీలకతీతంగా పట్టణంలోని 35 వార్డుల అభివృద్దే లక్ష్యంగా పాలకపక్షం పని చేస్తున్నదన్నారు. పట్టణంలోని అన్ని వార్డులకు సమానంగా రూ.3 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.



చైర్మన్ పోడియం ముందు బైఠాయించిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

భువనగిరి రూరల్, జూలై 22: ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజల కష్టాలు పట్టించుకున్న నాదుడే లేడని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండమడుగు నర్సింహ, మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పలు గ్రామపంచాయతీల కార్యాలయాల ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. గత ఫిబ్రవరి నెల నుంచి సర్పంచ్‌ల పాలన ముగిసి ప్రత్యేక అధికారుల పాలన వచ్చిన అనంతరం గ్రామస్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. మురుగు కాల్వలు, వీధి లైట్లు, మంచినీటి సమస్యలున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో విష్ణు, స్వామి, బాలరాజు, మాణిక్యం పాల్గొన్నారు.

గుండాల: పెద్దపడిశాల- సదర్శాపురం గ్రామాల మధ్యన ఉన్న కంకరరోడ్డును బీటీగా మార్చాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సమ స్యల పరిష్కారం కోసం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం నిరసన తెలిపారు. మట్టి రోడ్డును కంకర రోడ్డుగా మార్చినప్పటికీ కంకర మొత్తం తేలి పాదాచారులకు నడవడం కూడా కష్టంగా మారిందన్నారు. వెంటనే బీటీ రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పోతరబోయిన సత్యనారాయణ, లింగయ్య, ఎండీ. ఖలీల్, పద్మ, యాదమ్మ, మల్లయ్య, అంజయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండలకేంద్రంలో మెయిన్ రోడ్డు నుంచి సబ్ మార్కెట్ యార్డు వరకు డబుల్ రోడ్డు నిర్మించాలని సీపీఎం నాయకుడు డిమాండ్ చేశారు. పోరుబాట కార్యక్రమంలో భాగంగా గుంతలు పడిన రోడ్డు వద్ద సోమవారం నిరసన తెలిపారు. ప్రధాన రోడ్డు నుంచి సబ్‌మార్కెట్ వరకు బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలు పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి వేముల బిక్షం అన్నారు.

సంక్షిప్త సమాచారం..

చౌటుప్పల్ రూరల్: మండలంలోని దండుమల్కాపురం ఆందోల్‌మైసమ్మ బోనాల ఉత్సవాలు సోమవారం ముగిశాయి. పూర్ణహుతి కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఈఓ మోహన్‌బాబు, చిలుకూరి మల్లారెడ్డి, బుర్ర స్వామిగౌడ్, ముదిగొండ రమేష్, గుండు శ్రీహరిగౌడ్, చిట్టంపల్లి జంగయ్య పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: భువనగిరి జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్ సిబ్బందికి జీవో 60 ప్రకారం కనీస వేతనంగా రూ.15,600 ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ. ఇమ్రాన్ అన్నారు. సోమవారం జరిగిన కార్మికుల సమావేశంలో మాట్లాడారు. లక్ష్య సాధనకు ఈ నెల 29 నుంచి కార్మికుల నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు తెలిపారు. సమావేశంలో శోభన్ బాబు, పుష్ప, కమలమ్మ పాల్గొన్నారు.

బొమ్మలరామారం: సైబర్ క్రైమ్ నేరాల పట్ల అవగాహన ఉండాలని ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ అన్నారు. సైబర్‌క్రైమ్ నేరాలపై మండలంలోని సోలిపేట గ్రామంలో గల ఇమ్మానియేల్ బిజినెస్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. యువత విద్యార్థులు డ్రగ్స్ జోలికి వెళ్లొద్దన్నారు. తెలియని ఫోన్ నెంబర్ల నుంచి తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు సమాచారం, డెబిట్ కార్డ్ సమాచారం మెసేజ్ ద్వారా వచ్చే ఓటీపీ చెప్పాలని గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సోమేశ్‌కుమార్ ఉన్నారు.

బొమ్మలరామారం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ అన్నారు. ఆపదలో ఉంటే స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కు ఫోన్ చేస్తే సహాయం అందిస్తారని తెలిపారు. చెరువులకు, కుంటలకు దూరంగా ఉండాలని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండొద్దని సూచించారు.

చౌటుప్పల్ టౌన్: పట్టణంలో మంగళవారం బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి ఆలె చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లా, మండల పదాధికారులు, అనుబంధ సంఘాల మండల అధ్యక్షులు హాజరు కావాలని కోరారు.

సంస్థాన్‌నారాయణపురం: మండలంలోని పుట్టపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, డిక్షనరీలను పంపిణీ చేశారు. విద్యాభివృద్ధికి కస్తూరి ఫౌండేషన్ చేయూతనిస్తుందని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు నరేందర్, వీరమల్ల కార్తీక్‌గౌడ్, కొప్పు రామకృష్ణ, జర్నలిస్టు మర్రి మహేందర్‌రెడ్డి, వర్కాల చంద్రశేఖర్, దొంతగోని పెద్దులు, పిట్ట రాములు పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: భువనగిరి మండలం కూనూరు గ్రామానికి చెందిన మరిపల్లి రాములు సీపీఐ మండల కార్యదర్శిగా ఎన్నికయ్యారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాములును ఎన్నుకున్నట్లు ఆ పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యులడు ఏశాల అశోక్ తెలిపారు. సహాయ కార్యదర్శిగా ఉడుత రాఘవులు, కార్యవర్గ సభ్యులుగా పుట్ట రమేశ్, సోమన సబిత, అభిలాష్, చింతల పెంటయ్య, దాసరి లక్ష్మయ్య, అంజమ్మ, కౌన్సిల్ సభ్యులుగా భిక్షపతి, కృష్ణ, మల్లేశం, లక్ష్మీని ఎన్నుకున్నారు.

మోత్కూరు: మండలంలోని పాలడుగు గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గ్రామ ప్రత్యేక అధికారి, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శి రమేష్‌కు సీపీఎం ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేశారు. పాలడుగు చెరువుకు, కాల్వలకు మరమ్మతులు చేయాలని, సుమారు రూ.7లక్షలతో నిర్మించిన స్మశాన వాటికను వినియోగంలోకి తేవాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, నాయకులు దడిపెల్లి ప్రభాకర్, పిట్టల చంద్రయ్య, చింతకింది సోమరాజు, కొంపెల్లి గంగయ్య, వడ్డెపల్లి లక్ష్మణ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండలకేంద్రంలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను సోమవారం క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. మెయిన్ రోడ్ నుంచి శివాలయం వరకు సెంటర్ లైటింగ్, డబుల్ రోడ్ నిర్మాణం చేపట్టాలని, కమ్యూనిటి భవనం, అండర్ డ్రైనేజీ కాలువల నిర్మాణం, ప్రధాన రోడ్ నుంచి పెద్దమ్మ దేవాలయం వరకు, మార్కెట్ యార్డు నుంచి కామునిగూడెం వరకు బిటి రోడ్ నిర్మాణం తోపాటు పలు సీసీ రోడ్లు, నిర్మాణాలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, పోతగాని మల్లేశం, మాజీ సర్పంచ్ జె.నగేష్, వై. శ్రీనివాస్, టి.అనిల్ సాయి పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: ఆలేరు ఎస్టీవో కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న సీనియర్ అకౌంటెంట్ ఎండీ. ఖదీర్, కార్యాలయ సబ్ ఆర్డినేట్ సత్యనారాయణను రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కడారు రమేష్, బొమ్మకంటి బాలరాజు సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు మంద సోమరాజు ఖాజా అలీ, బూడిద శ్రీనివాస్, సంధ్య, సుజాత, యాదగిరి, సత్తయ్య, జగన్మోహన్, తదితరులు ఉన్నారు.

ఆలేరు రూరల్: ఆలేరుకు చెందిన విద్యార్థులు తైక్వాండోలో గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమని ఎస్‌ఐ వెంకట శ్రీను అన్నారు. ఆలేరుకు చెందిన ఎం. హరిత, భావన, జి తేజ్‌పాల్‌రెడ్డి హైదరాబాద్‌లోని కోట్ల విజయ్ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో తైక్వాండోలో గోల్డ్ మెడల్ సాధించారన్నారు. మనోజ్. రహమాన్‌లకు సిల్వర్ మెడల్ దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ దర్శనం క్రాంతి ఉన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: రామన్నపేట మండల కేంద్రనంలో ఈనెల 27. 28న జరిగే సీఐటీయు జిల్లా శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం కోరారు. జిల్లా శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరించారు.